నేడు గురు పౌర్ణమి వేడుకలు



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో నేడు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సాయిబాబా సంస్థాన్ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం బాబాకు కాకడ హారతి, మంగళ స్నానం, అర్చన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, మండపారాధన, ఏకాదశ కలశ స్థాపనాపూర్వక అభిషేకం, సాయి గాయత్రి హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం ఉంటుందని వివరించారు. సాయంత్రం 6.30 గంటలకు ధూప్ హారతి ఉంటుందని, 7 గంటలకు గురు సత్కారం అనంతరం సేజ్ హారతితో వేడుకలు ముగుస్తాయని చెప్పారు. కలశ పూజలో పాల్గొనే భక్తులు పూజా సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని సంస్థాన్ కమిటీ సభ్యులు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి పూర్వ సేవా ప్రముఖ్ సుహాస్‌రావుజీ అన్నారు. శనివారం నింబోలి అడ్డలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రస్తుత కలుషిత వాతావరణంలో పర్యావరణ ప్రాముఖ్యత గురించి చిన్నారులకు వివరించారు. మనం నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల అధ్యక్షుడు హనుమంతరావు, రమేష్ మంజునాథ్, డీఆర్‌ఎస్ నరేంద్ర, సురేష్ మంజునాథ్, కేసరి నర్సింగ్‌యాదవ్, మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రవి, ప్రధానాచార్యులు స్రవంతి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కాచిగూడ: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ తెలంగాణ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ -2024 పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను శనివారం కాచిగూడలోని యమగుచ్చి తైక్వాండో అకాడమీ (వైజీటీఏ)లో హెడ్ కోచ్ విశ్వనాథ్, సీనియర్ కోచ్ పులిగంటి వేణుగోపాల్ అభినందించారు. తైక్వాండో సాధన వల్ల క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బి.కార్తికేయ, సీహెచ్. హరీష్, నితేష్‌లు తైక్వాండో జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు.

'హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్'

కాచిగూడ: ప్రజలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ అన్నారు. శనివారం కాచిగూడలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు తొలివిడత కింద రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిన సందర్భంగా కాచిగూడ పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. రుణమాఫీ చేస్తే మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తన పదవికి రాజీనామా చేస్తానన్న మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ వి.వి.గిరినగర్ కమ్యూనిటీహాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పిల్లలకు అందుతున్న సదుపాయాలు, ఆయాల విధుల నిర్వహణలపై అంగన్‌వాడీ టీచర్ ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని సరైన రీతిలో అందించాలన్నారు. సరైన సమయంలో సదుపాయాలు అందకపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అంగన్‌వాడీ టీచర్ ప్రమీలను సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నేతలు సాయికుమార్, వడ్డేపల్లి ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ సంయుక్త కన్వీనర్‌గా సంతోష్

చిక్కడపల్లి: టీపీసీసీ లీగల్ సెల్ సంయుక్త కన్వీనర్‌గా పాక సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తానన్నారు. అవసరమైన వారికి న్యాయ సలహాలను ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. చైతన్య, బషీర్, సిద్దార్థ్‌లు సాయిసంతోష్‌ను కలిసి సన్మానించారు.

మాస వార పత్రికల నిర్వహణ ఎంతో కష్టం

డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: ఒకప్పుడు భారతి, ఆంధ్రపత్రిక తరువాతి కాలంలో విపుల, చతుర నవ్య వంటి వార, మాస పత్రికలు కనుమరుగైన సందర్భంలో సాహితీ కిరణం మాస పత్రిక నిర్విఘ్నంగా 15 ఏళ్లుగా నడపటం సులువు కాదని సివిల్ సర్వీసెస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై సాహితీ కిరణం మాసపత్రిక 15వ వార్షిక వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ సాహితీ కిరణం సహస్ర కిరణాలు వెదజల్లుతూ స్వర్ణోత్సవ వేడుక కూడా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఏం. దత్తాత్రేయ శర్మను పింగలి జగన్నాథరావు స్మారక పురస్కారంతో, ఏస్.నర్సయ్య స్మారక పురస్కారం రమణ వెలమకన్నికి, ఏస్.బామలమ్మ స్మారక పురస్కారం శైలజా మిత్రలకు జి.చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక పురస్కారం బి.రామాచంద్రరావుకు బహూకరించారు. జి.వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన సభలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు స్వాగతం పలికారు. కవి పెదూరి వెంకటదాసు సభ నిర్వహణ చేయగా, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, నేటినిజం పత్రిక సంపాదకుడు బైసదేవదాసు, ఎం.బాల గంగాధరయ్య తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతోడాక్టర్ కేవీ రమణాచారి, తదితరులు

ఆశలు ఆవిరి..!

- సుందరయ్య పార్కులో విరిగిన ఆట వస్తువులు
- ఆటలకు నోచుకోని చిన్నారులు
- నాణ్యతలోపం వల్లే ఈ పరిస్థితి అంటూ ఆరోపణలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం



పార్కులో పాడైన భూ చక్రం



శిథిలావస్థకు చేరి మూలన పడ్డ ఆట సామగ్రి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో గత ఏడాది ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట వస్తువులు, కొన్ని పరికరాలు ఎక్కడికక్కడే



పార్కులో నిరుపయోగంగా ఉన్న ఊయల

విరిగిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వస్తువులు విరిగిపోవడం పట్ల పలువురు వాకర్స్ విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.నాణ్యత లేని పరికరాలు తీసుకురావడం వల్లనే పరికరాలు విరిగిపోతున్నాయని విమర్శిస్తున్నారు.జిమ్ పరికరాలు సైతం నాణ్యత లోపించి ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్న పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేసిన 5–6 నెలలకే నిరుపయోగంగా ఉండడం, మరమ్మతులకు నోచుకోకపోవడంపై ఏ మేరకు అవినీతి జరిగిందో అని విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో కూడా ఇదే విధంగా చిన్న పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయగా అవి కొంత కాలానికే విరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయని మరోసారి ఏర్పాటు చేయడంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు.

నిరాశకు గురవుతున్న చిన్నారులు...

ఉల్లాయా, భూ చక్రం, జారుడుబండ తదితర ప్రధాన పరికరాలు మూలకు పడిఉన్నాయి. ఎంతో ఆసక్తితో పార్కుకు వచ్చే చిన్నారులకు ఆట వస్తువులు విరిగిపోయి ఉండడంతో వారు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. వేసవి కాలంతో పాటు ప్రతి ఆదివారం సెలవు దినం రోజుల్లో చిన్న పిల్లలు పెద్దఎత్తున పార్కుకు వచ్చి ఆహ్లాదకర వాతావరణంలో ఆటలు ఆడుతూ ఎంతో ఆనందంగా ఇక్కడ చాలా సేపు గడుపుతారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు సైతం పిల్లలను ఆడిపించడానికి సుందరయ్య పార్కుకే తీసుకువస్తుంటారు. ఈ పార్కులో ఉన్న ఆట వస్తువులన్నీ విరిగిపోవడంతో ఇటూ చిన్న పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా నిరాశకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు...

పార్కులో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట వస్తువులు ఏడాది కాలంలోనే విరిగిపోయిన ప్పటికీ వాటి గురించి పట్టించుకునే పాపానపోలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల అలసత్వం, అవినీతివల్లనే నాణ్యతలేని పరికరాలను ఏర్పాటు చేస్తూ పిల్లలను నిరాశకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.



కొత్త పరికరాలను ఏర్పాటు చేయాలి



పార్కులో చిన్న పిల్లలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అనేక మంది పిల్లలు ఎంతో ఉత్సాహంతో పార్కుకు వస్తుంటారు. పరికరాలు ఊయాల, భూ చక్రం, జారుడు బండ వంటి పరికరాలు విరిగిపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలి.

–పి.వి.నిరంజన్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి.

జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాం



చిన్నపిల్లల ఆట వస్తువులు విరిగిపోవడం చాలా బాధాకరం. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. అయినా కూడా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవడం లేదు. చిన్న పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన విషయం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు. వెంటనే ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి.

– కె.వీరయ్య, హైదారాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నరేందర్‌గౌడ్

కాచిగూడ/సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి బీసీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడల విధానాలతో బీసీలు భారీగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీల అభ్యున్నతికి స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని మంత్రి హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. నగిరి ప్రవీణ్‌కుమార్ పటేల్, శ్రీహరిగౌడ్, భిక్షపతి, పెంట అజయ్ పటేల్, సాయికిరణ్, శ్రీనాథ్, నిమ్మల శ్రీనివాస్, రాజుయాదవ్, ప్రశాంత్, రాజేష్, బీసీ యువజన సంఘం నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సమితి నేత సుల్తాన్ యాదగిరి

కాచిగూడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొని ఆర్థికంగా, కోర్టు కేసులతో నష్టపోయిన ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధికోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల సమితి రాష్ట్ర నాయకుడు యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం వెంటనే ఇవ్వాలన్నారు. పెన్షన్ పథకం కింద నెలకు రూ.30 వేలు గౌరవ వేతనం, ఆరోగ్య బీమా రూ.20 లక్షల వరకు ఇవ్వాలని చెప్పారు. విద్య, ఉద్యోగాల్లో ఉద్యమకారుల కుటుంబాలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. 200 ఎకరాల్లో అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నాలాల పరిశీలన



అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో నాలాలను పరిశీలిస్తున్న డీఎంసీ మారుతీ దివాకర్



బాగ్ అంబర్‌పేట్‌లో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట : వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో అధికారులతో కలిసి నాలాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో తలెత్తుతున్న సమస్యలను పరిశీలించారు. నాలాల్లో వరదనీరు వెళ్లేందుకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో డీఎంసీ పర్యటన...

ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి డీఎంసీ మారుతీ దివాకర్ నియోజకవర్గంలోని పలు ప్రధాన నాలాలను పరిశీలించారు. సీపీఎల్ రోడ్డులో నాలాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటామన్నారు. డీఈ రఘు, అధికారులు పాల్గొన్నారు.

కారంచేడు పోరాటం స్ఫూర్తిదాయకం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాసీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కారంచేడు పోరాటం ఎంతో మంది దళితులకు స్ఫూర్తినిచ్చిందని ప్రొఫెసర్ కాసీం అన్నారు. కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండ మొదటిది కాదు, చివరిది కాదు అని ఆ సంఘటన జరిగిన తరువాత కూడా వేంపేట, లక్ష్మీపేటలో దళితులపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ పేరిట సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ దళితుల మీద దాడి చేయడానికి ఎవరు సహసించకూడదనే ఉద్దేశంతో నాడు పెద్ద ఎత్తున ఉద్యమం జరిగిందని ఆ ఉద్యమం స్ఫూర్తితోనే దళిత వర్గానికి చెందిన ఎంపీలందరూ రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అంత పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతున్నప్పటికీ దళితుల వెలివేత, దాడులు, హత్యల పరంపర కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ,ఎస్టీ బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఆర్‌టీఎస్ రిటైర్డ్ అధికారి ఏ.భరత్ భూషణ్, నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం జాతీయ నాయకులు డాక్టర్ ఆరెపల్లి రాజేందర్, ఆల్ ఇండియా కాన్ఫరేషన్ జాతీయ నాయకులు మహేశ్వర్‌రాజ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింగ్‌రావు, జి.శేఖర్, ప్రొఫెసర్ తిరుపతి, ప్రముఖ రచయిత గోగు శ్యామల, జి.శంకర్ పాల్గొని ప్రసంగించారు.

బోనాలకు కేంద్రమంత్రికి ఆహ్వానం



అంబర్‌పేట: అంబర్‌పేటలో ప్రతిష్టాత్మకంగా జరిగే బోనాల వేడుకలకు హాజరు కావాలని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానించారు. శనివారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రంగంపల్లి రాజు, సుధాకర్, గడ్డం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేశవ్‌రావుకు సన్మానం



కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన కె.కేశవరావును జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆయనను సన్మానించి అభినందించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషిచేస్తున్న కేశవరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుధాకర్‌గౌడ్ తదితరులున్నారు.

'అమ్మమాట, అంగన్‌వాడీ బాట'కు విశేష స్పందన



కాచిగూడ: చిన్నారులకు ప్రీ స్కూల్ కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు వచ్చేలా స్త్రీ శిశు సంక్షేమ శాఖ చేపట్టిన 'అమ్మమాట –అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కాచిగూడ సెక్టార్ సూపర్‌వైజర్ వాకిట బాల అన్నారు. 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా శనివారం నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బస్తీల్లోని తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ శివరాణి, పుణ్యవతి, నయీమున్నీసా, విజిత తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో జోరుగా వర్షం



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షం నీరు



గంగపుత్ర కాలనీలో పారిశుధ్య పనులు చేపడుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ముషీరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావం వల్ల ముషీరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు స్కూల్‌కు వెళ్లే సమయంలో వర్షం పడుతుండడంతో తడుస్తూనే పాఠశాలలకు వెళ్లారు. పలు చోట్ల వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడం వల్ల వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. గంగపుత్ర కాలనీలో పారిశుధ్య కార్మికులు రోడ్లపై పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించడంతో పాటు వర్షం నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షం నీరు నిలవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జీహెచ్‌ఎంసీ సిబ్బందికి స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పూస గోరఖ్‌నాథ్ వివరించి వారి వెంటనే ఉండి పనులు చేసేలా కృషి చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: ఓయూలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్ అకాడమీ క్యాంపస్‌లో వివిధ స్వల్పకాల కోర్సుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నైపుణ్య శిక్షణలో భాగంగా 55 ఏళ్లు పైబడిన సీనియర్ సిటీజన్స్‌కు ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, టాలీప్రైమ్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని లిటరసీ హౌజ్ కార్యదర్శి నాగలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీ.లాంగ్వేజ్, టైలరింగ్, డిజైనింగ్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పేయింటింగ్, మగ్గం వర్క్స్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెహిందీ డిజైనింగ్, హెయిర్ స్టైలింగ్‌లో శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 99512 10441, 97010 98541.

కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు..

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. 'డిప్లొమా ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్', 'పీజీ డిప్లొమా ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్', మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌తో పాటు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్', డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ తదితర కోర్సుల్లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. అసక్తిగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9505800050, 9505800047.

మానవ మనుగడకు కళలు దోహదం



చిక్కడపల్లి: మానవ మనుగడకు కళలు దోహదం చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. శనివారం రాత్రి త్యాగరాయగానసభలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు సభికులను ఆకట్టుకుంది. అనంతరం నృత్య గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి బుర్గుల మధుసూదన్, విశ్రాంత ఐఏఎస్ ఆర్‌వీ చంద్రవదన్, సరసవతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖులు నగేష్‌ముదిరాజ్, నారాయణ, విక్కీ మాస్టర్, రూపశ్రీ కృష్ణప్రియ శివజ్యోతి, అనందమయి తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్యనాయక్‌కు సన్మానం

చిక్కడపల్లి: ట్రేకర్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌ను ఏఐవైహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు వళిగి ప్రభాకర్, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు ధర్మరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బిజిలి కుమారస్వామి, ముషీరాబాద్ ఇంచార్జి దాసులు శనివారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. షెడ్యూల్ ట్రైబ్స్ సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషిచేస్తానని బెల్లయ్యనాయక్ అన్నారని వారు తెలిపారు.

పనులు పూర్తయ్యేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న రమేష్, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

అమ్మ ఆదర్శ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్

ముషీరాబాద్: నిలిచిపోయిన ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను రమేష్ సందర్శించి పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో పాటు బురదమయంగా మారడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా విద్యార్థులకు మెరుగైన మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, తరగతి గదుల్లో విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రతన్ తదితరులు పాల్గొన్నారు.